ప్రజాశక్తి

సోమవారం 11 డిసెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి



చేనేతలకు ప్రభుత్వ పథకాలను అందిస్తాం

◆ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

◆ జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రాచపూటి రమేష్



రాచపూటి రమేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను చేనేత కార్మికులందరికీ అందిస్తున్నామని, వీటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి రాచపూటి రమేష్ తెలిపారు. 'వ్యవసాయం తర్వాత చేనేతలు అత్యధికమంది మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ ప్రధానంగా గిట్టుబాటు ధరలు లేక చేనేత రంగం చతికిలబడింది. జిల్లాలో ఈ వత్తిపై దాదాపు 25 వేల మంది జీవిస్తున్నారు. వారికి గిట్టుబాటు ధరలు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది' అని చేనేత జౌళిశాఖ జిల్లా ఎడి రాచపూటి రమేష్ తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న :జిల్లాలో ఎన్ని మగ్గాలు ఉన్నాయి? ఎక్కడ ఎక్కడ ఉన్నాయి.?

ఎడి : సత్యసాయి జిల్లాలో దాదాపు 25 వేల మగ్గాలు ఉన్నాయి. ప్రధానంగా ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నాయి.

ప్రశ్న: చేనేతలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న పథకాలు? వాటి వివరాలు ఏమిటి.?

ఎడి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. ముద్రా రుణాలు 1710 మందికి రావాల్సి ఉండగా నవంబర్ వరకు 475 మందికి వచ్చాయి. దాదాపు రూ.533 లక్షలు మంజూరు అయ్యింది. మిగతా వారికి త్వరలో మంజూరు కానున్నాయి. 1213 చేనేతల రుణాల కోసం ప్రతిపాదనలు పంపాం. చేనేత పింఛన్లు పాతవి 15,509 మందికి వస్తుండగా కొత్తవి మరో 1200 మందికి ప్రతిపాదించాం. ఒక్కొక్కరికి 2750 రూపాయలు నెలకు పింఛను వస్తుంది. 57 ఏళ్ల వయసు దాటిన వారికి ఈ పింఛన్లు మంజూరు చేస్తాం. నేతన్న నేస్తం కింద ఒక్కొక్కరికి రూ.24వేలు చొప్పున 15500 మందికి రుణాలు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. మగ్గము షెడ్డు ఉన్నవారికి స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకున్నవారికి రుణ సదుపాయం కల్పిస్తున్నాం. 316 మందికి జాకార్డు మగ్గాలు ఇతర పనిముట్లు లిఫ్టింగ్ మిషన్ అందించాం. లిఫ్టింగ్ మిషన్ వల్ల కాలుతో తొక్కకుండా సులభంగా మగ్గం నేయడానికి సదుపాయం ఉంది. ఈ పనిముట్లకు 15 శాతం సబ్సిడీ ఉంటుంది. ఇప్పటికే 83 మంది ఎస్సీ చేనేతలకు వీటిని పంపిణీ చేశాం. ఈ స్వయం సహాయక సంఘాలలో 10 మంది సభ్యులుగా ఉంటారు.



ప్రశ్న:చేనేత వస్త్రాలకు ప్రభుత్వపరంగా చేపడుతున్న మార్కెట్ సదుపాయాలు ఏమిటి..?

ఎడి : చేనేతలు తయారు చేసిన వస్త్రాలను పలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తున్నాం. కార్మికులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం వాటి ఖర్చును భరిస్తోంది. దీంతో ఆ వస్త్రాలకు ప్రచారం కూడా జరుగుతుంది. ఆప్కో ద్వారా ఇప్పటికీ అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ధర్మవరంలో కూడా ఈ అమ్మకాలు చేయడానికి అవకాశం ఉంది. మరిన్ని ఆప్కో కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంది. దానికి తగిన ప్రతిపాదనలు పంపాం. టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కేంద్రం మడకశిరలో ఉంది. ఈ టెక్నాలజీ వల్ల కొత్త డిజైన్ చేసుకోవచ్చు. ఇతర కంపెనీలలో కూడా ఉద్యోగ అవకాశాలు చేసుకోవడానికి వీలుంటుంది. పదవ తరగతి ఆపైన చదువుకున్న వారు ఈ టెక్నాలజీ కేంద్రంలో మూడున్నర సంవత్సరం కోర్సులో చేరాల్సి ఉంటుంది. అలా శిక్షణ పొందిన వారు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. సోమందేపల్లి కేంద్రంలో 40 రోజులు శిక్షణ కొత్త డిజైన్ నేర్చుకోవడానికి అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇందులో శిక్షణ పొందే వారికి స్టయిఫండ్ కూడా ఇస్తారు.


ప్రశ్న:మగ్గాలపై ప్రభుత్వపరంగా ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది?

ఎడి : జిల్లాలో వివిధ సొసైటీలు పర్యవేక్షణకు 12 మంది పర్సనల్ ఇన్‌ఛార్జులు ఉన్నారు. వారు మగ్గాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరో 6 మంది జౌళి శాఖ చేనేత ఏడీలు ఉంటారు. వారు కూడా పర్యవేక్షిస్తుంటారు. ధర్మవరం చేనేత వస్త్రాలకు ప్రపంచ ఖ్యాతి గడించింది. అందుకు కేంద్ర ప్రభుత్వం అవార్డు కూడా వచ్చింది. ఈ అవార్డు ఉమ్మడి జిల్లాలకు దక్కింది. ప్రస్తుతం మరో అవార్డు కోసం ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న: మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? చేనేతలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి.?

ఎడి : నూతన సత్యసాయి జిల్లాలో 11 మంది ఏడీలు ఉండాల్సి ఉండగా 6 మంది ఉన్నారు. కార్యాలయం మున్సిపాలిటీ పరిధిలో పట్టణానికి దూరంగా ఉన్నందున పలువురు చేనేతలు కార్యాలయాలకు రాలేకపోతున్నారు. పట్టణంలోనే సరైన ప్రదేశాన్ని ఎంపిక చేసి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. వాహన సౌకర్యం లేకపోవడంతో జిల్లా అంతటా సిబ్బంది బస్సులలో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలి. చేనేత కార్మికులు చాలామంది మైక్రో ఫైనాన్స్ కార్పొరేషన్‌లలో అప్పులు చేస్తున్నారు. దీంతో వడ్డీలు పెరిగిపోయి ఇబ్బందులు పాలవుతున్నారు. అర్హత ఉన్నవారికి తమ శాఖ ద్వారా రుణాలు పొందవచ్చు. చేనేతలు ఎవరూ మైక్రో ఫైనాన్స్ వలలో చిక్కుకోవద్దని సూచిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

అవినీతి పట్టణ ప్రణాళిక



పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం వార్డుల వారీగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి సచివాలయానికి ప్లానింగ్ సెక్రటరీలను నియమించడంతో పాటు వీరి పైఅధికారులుగా టిపిఒ, ఎసిపిలను నియమించింది. వీరి ద్వారా పట్టణంలో ఇళ్ల నిర్మాణాల పనులు జరగాల్సి ఉంది. ఇంతమంది అధికారులు ఉన్నా హిందూపురం పురపాలక సంఘంలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలు ఆగడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తం వుతున్నాయి. మున్సిపల్ ఆస్తులను సైతం కౌన్సిల్ సమావేశంలో ఆమోదం చేయించేసుకుని ప్రయివేటు వ్యక్తులకు ధారదత్తం చేస్తున్నారు. దీంతో పురపాలికకు భారీగా ఆదాయం గండి పడుతోంది. ఇలాంటి వాటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సిన వార్డు ప్లానింగ్ సెక్రటరీలు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు, కొందరు వార్డు ప్రజాప్రతినిధులకు కలెక్షన్ ఏజెంట్లు మారినట్లు పెద్దఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

◆ ఆగని అక్రమ నిర్మాణాలు

◆ ప్రభుత్వ స్థలాల కబ్జా

◆ కలెక్షన్ ఏజెంట్లుగా ప్లానింగ్ సెక్రటరీలు..?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక విభాగం పేరుకే అన్నట్లు మిగిలిపోతోంది. ఇక్కడ ఎవరూ పనిచేసేవారు లేరు. వచ్చిన వారంతా కేవలం దండుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదికారులు పూరి స్థాయిలో సిబ్బందిని నియమించక పోవడం, దీన్ని అవకాశంగా తీసుకుని సొంత వ్యాపకాలు చేసుకుంటున్నారు. ఈ కార్యాలయంలో అసిస్టెంట్ సిటీప్లానర్, టిపిఒ, ఇద్దరు టిపిఎస్‌లు, నలుగుదు బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లతో పాటు కింది స్థాయి సిబ్బంది ఉండాలి. అయితే అసిస్టెంట్ సిటీప్లానర్, డిప్యూటేషన్ విధానంలో టిపిఒ మాత్రమే ఇక్కడ విధుల్లో ఉన్నారు. మిగిలిన పోస్టులు అన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒక ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ప్లానింగ్ సెక్రటరీలు పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తే పురపాలక సంఘం వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలతో పాటు మున్సిపల్ రిజర్వు స్థలాలను పరిరక్షణ చేయడానికి అవకాశాలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే కొంత మంది ప్లానింగ్ సెక్రటరీలు అక్రమ నిర్మాణాలు గుర్తించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించడం, వారికి నోటీసులు ఇవ్వడం, చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.

హిందూపురం పురపాలక సంఘంలో కొంత మంది సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి అనుమతుల మాటున అడ్డగోలు నిర్మాణాలకు పచ్చజెండా ఊపుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అందరికీ వాటాలు ఇస్తున్నామనే ధీమాతో టౌన్‌ప్లానింగ్ విభాగంలో కొందరు అక్రమ నిర్మాణాలకు పక్కా ప్లాన్ వేస్తున్నారు. అడ్డదారిలో అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఒక భవన నిర్మాణానికి ప్లాన్ పొందాలంటే ప్రభుత్వ ఖజానాకు కనీసం రూ.60 వేలు చలానా చెల్లించాలి. కానీ అక్రమార్కులు టౌన్ ప్లానింగ్ విభాగంలో కొంతమందికి మామూళ్లు ఇచ్చి ప్రసన్నం చేసుకుంటున్నారు. దీంతో అనుమతులు లేకుండానే అవినీతి పునాదులపై అంతస్తులు నిర్మిస్తున్నారు. పట్టణంలో ఎటువంటి అనుమతులు లేకుండా అనేక భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీనికి అధికార పార్టీకి చెందిన కొంత మంది కౌన్సిలర్లు సైతం పూర్తిగా సహకరిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి భవన నిర్మాణానికి ముందే భూమి యజమాని టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పరిశీలించిన తరువాత టౌన్‌ప్లాన్ విభాగంలో పనిచేసే సర్వేయర్ స్థల పరిశీలన చేసి, కొలతలు వేయాలి. ఆ తర్వాత అది నిర్మాణానికి యోగ్యమైనదా..? కాదా..? అనేది ధ్రువీకరణ చేయాలి. టౌన్‌ప్లానింగ్ అధికారులు దీనికి ప్లాన్ జారీ చేయిస్తారు. కానీ ఇక్కడ అధికారులు అవేమీ పట్టించుకుంటున్న దాఖలాలు కన్పించడం లేదు. అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత ప్లాన్ అప్రూవ్ కాకుండానే భవన నిర్మాణాలు పూర్తవుతున్నాయి. కొందరు కనీసం అనుమతి కోసం దరఖాస్తు చేయకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు.



తెర వెనుక నాయకులు...

హిందూపురం పురపాలక సంఘంలో కొన్నేళ్లుగా కొనసాగుతున్న అక్రమ కట్టడాల వెనుక అధికార పార్టీకి చెందిన కొంత మంది కౌన్సిలర్ల హస్తం ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన వారిలో కొంత మంది పాలకులను ప్రసన్నం చేసుకుంటే మున్సిపల్ రిజర్వు స్థలంలో నిర్మాణాలు చేసుకోవాడానికి అనుమతులు లభిస్తున్నాయి. దీనికి నిదర్శనం సిండికేట్ ఫార్మ సొసైటీకి చెందిన స్థలంలో హోల్‌సేల్ మార్కెట్ నిర్వహణకు ఇచ్చిన అనుమతులే నిదర్శనం. వీరి తీరును చూసి అధికారులు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. చెప్పినట్లు వినకపోతే వారిపై కక్ష సాదింపునకు పాల్పడుతూ వారిని ఎలాగైన ఎసిబి అధికారులకు పట్టిస్తామని బెదరిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా అవినీతి మయం అయిన పట్టణప్లానింగ్‌పై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

భారాలు వేస్తూ.. సౌకర్యాలు కల్పించరా..?

పట్టణ నివాస ప్రాంతాల్లో మౌలిక సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజలపై ప్రభుత్వాలు అనేక రూపాల్లో భారాలు వేస్తున్నాయని, అయితే సౌకర్యాలు కల్పించడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం జరుగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. ఆదివారం నాడు పట్టణంలోని ఎన్జీవో హోంలో శ్రీ సత్యసాయి జిల్లా పట్టణ నివాస ప్రాంత కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాంభూపాల్ జిల్లా వ్యాప్తంగా మున్సిపాల్టీ, నగర పంచాయతీల్లో పేదలు నివసించే ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు సౌకర్యాలు కూడా లేవన్నారు. చెత్త పన్ను, నీటి పన్ను పేరుతో ప్రజలపై భారాలు వేసే ప్రభుత్వాలకు కనీస సౌకర్యాలను కల్పించాలనే చిత్తశుద్ధి లేకపోవడం విచాకరం అన్నారు. పట్టణ నివాస ప్రాంతాల్లో పేదలు నివసించే కాలనీలకు మౌలిక సౌకర్యాల కోసం డబ్బులు ఖర్చు చేయడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేస్తున్న నివాస ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం, రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేదన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాల్టీల్లో తాగునీటి కుళాయిలకు మీటర్లు పెట్టి డబ్బులు వసూలు చేయాలనే దుర్మార్గమైన విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయన్నారు. ప్రజలకు ఉచితంగా అందించాల్సిన పౌర సేవలకు ఫీజు వసూలు చేయడం అన్యాయమన్నారు. నివాస ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను గుర్తించి పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, నాయకులు జివిఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, బాబ్‌జాన్, శాంతి బాయ్, గంగాధర్, వెంకటరాముడు, రమణ, బాబా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కరువు బృందాలు రాక

◆ 12, 13న ఉమ్మడి జిల్లాలో పర్యటన ◆ మూడు బృందాలుగా పరిశీలనలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర కరువు బృందాలు రెండు రోజుల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 12, 13వ తేదీల్లో అనంతపురం, సత్యసాయి జిల్లాలో కేంద్ర కరువు బృందాల పర్యటన ఉండనుంది. ఈ మేరకు రెండు జిల్లాల అధికారులకు సమాచారం వచ్చింది. పర్యటన ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి తీవ్ర వర్షాభావ పరిస్థితులు అనంతపురం, సత్యసాయి జిల్లాలో నెలకొంది. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 28 మండలాలు, సత్యసాయి జిల్లాలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర కరువు బృందాలు పర్యటించి కరువును అంచనా వేయనున్నాయి.

మూడు బృందాలుగా పుర్యటన

కేంద్ర కరువు బృందానికి కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వం వహించనున్నారు. ఈయన నాయకత్వంలో వచ్చే కరువు బృందంలో మొత్తం పది మంది సభ్యులు ఉండనున్నారు. ఈ బృందం ఈనెల 11వ తేదీన బెంగళూరుకు చేరుకుంటుంది. ఈనెల 12వ తేదీన అనంతపురంలో మూడు బృందాలు పర్యటించనున్నాయి. ఆ తరువాత 13వతేదీన సత్యసాయి జిల్లాలో ఒక బృందం పర్యటించనుంది.

మొదటి రోజు అంటే ఈనెల 12వ తేదిన మూడు బృందాలు అనంతలో పర్యటన

టీమ్-1 : ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయం చేరుకుంటారు. అక్కడ గంటపాటు కలెక్టర్ ఇచ్చే నివేదికను పరిశీలిస్తారు. ఉదయం 11.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనంతపురం రూరల్ మండలంలోని కామారుపల్లి, కురుగుంట గ్రామాల్లో వేరుశనగ, ఆముదం, కంది పంటలను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం కురుగంటలోనే భోజన విరామం తరువాత పామిడి మండలంలో ఎద్దులపల్లి, అనుంపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరిశీలిస్తారు. అక్కడితో మొదటి రోజు పరిశీలన పూర్తవుతుంది.

టీమ్-2 : కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం రెండో బృందం రాయదుర్గం మండలం ఆవులదట్ల, జుంజురాంపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంటలోపు పరిశీలిస్తారు. మధ్యాహ్న విరామం తరువాత మధ్యాహ్నం మూడు గంటల నుంచి కళ్యాణదుర్గం మండలంలోని చాపిరి, గరుడంపల్లి గ్రామాల్లో రెండో బృందం పర్యటిస్తుంది.

టీమ్-3 :ఉదయం కలెక్టరేట్‌లో సమాదేశం అనంతరం 11.30గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఉరవకొండ మండలంలో పర్యటిస్తారు. ఆమిద్యాల, రాకెట్ల గ్రామాల్లో కేంద్ర కరువు బృందం పర్యటిస్తుంది. భోజన విరామం తరువాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆత్మకూరు మండలంలోని తలుపూరు, తోపుదుర్తి గ్రామాల్లో పర్యటిస్తుంది.

రెండవ రోజు సత్యసాయి జిల్లాలో ఒకే బృందం పర్యటన

ఈనెల 13వ తేదీన సత్యసాయి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటిస్తుంది. ఉదయం అనంతపురం నుంచి బయలుదేరి 11.30 గంటలకు పరిగి మండలం చేరుకుంటుంది. ఆ మండలంలోని మోద, యర్రగుంట్ల గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలిస్తుంది. 11.45 గంటల నుంచి మధ్యాహ్నం భోజన విరామం లోపు మడకశిర మండలంలోని హరేసముద్రం, కదిరేపల్లి గ్రామాల్లో పర్యటిస్తుంది. భోజనం తరువాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల్లోపు గుడిబండ మండలంలోని గుడిబండ, మందలపల్లి గ్రామాల్లో పర్యటిస్తుంది. అనంతరం మూడున్నర గంటలకు అమరాపురం మండలం చేరుకుంటుంది. అక్కడ వలస గ్రామంలో పంటలను పరిశీలించి రాత్రికి అనంతపురం చేరుకుంటుంది.

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కదిరిలో శ్రీ ఖాద్రి సంక్షేమ సంఘం ప్రపంచ అంతర్జాతీయ వికలాంగుట దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి వాల్మీకి పాఠశాల అధినేత, వైసిపి నాయకులు, అభిజ్ఞా ఫౌండేషన్ నిర్వాహకులు పవన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ఆర్థికంగా విద్యాపరంగా పూర్తిస్థాయిలో ఉన్నత శిఖరానికి చేరుకోవాలని సూచించారు. అంతకు ముందు వికలాంగుల భవనం నుంచి జ్యోతిరావు పూలే విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు గోసాల శ్రీరాములు, నాయకులు సూర్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గం కాంగ్రెస్ కమిటీని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగన్న అశ్వత్ నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు అధ్యక్షులను ఎంపిక చేశారు. ఈసందర్భంగా వారికి పార్టీ ద్వారా వచ్చిన నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగనాయక నారాయణ, ముదిగుబ్బ పిసిసి డెలికేట్ సభ్యులు మిషారా మద్, తాడిమర్రి మండల మాజీ కన్వీనర్ కాటమయ్య, ధర్మవరం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖరీం, మునాఫ్, ఫారూఖ్, జాఫర్, నూర్, షబ్బీర్, రంగనాథ్‌తో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వాన్నస్థితిలో గ్రామీణ రహదారులు

ప్రజాశక్తి-నల్లమాడ

మండల పరిధిలోని అనేక గ్రామాల రహదారులు అధ్వాన్నస్థితికి చేరినా పట్టించుకునేవారే కరువయ్యారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా రెడ్డిపల్లి నుంచి తిప్పయ్యగారిపల్లె, రెడ్డికుంటతండా, కొండ్రవారిపల్లి, కొండకిందతండా, నేరాలవంకతండా, సానివారిపల్లి, నల్లమాడ నుంచి చెరువుమాండ్లపల్లి, మసకవంకపల్లి నుంచి కురమాల వెళ్లే రహదారులు కంకర తేలాయి. దీంతో వాహనదారుల సంగతి అటుంచితే కనీసం పాదచారులు నడవడానికి కూడా సాధ్యం కానంతగా పాడైపోయాయి. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు దట్టంగా ఏపుగా రహదారికిపైకి పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకోట్లపల్లి నుంచి నల్లమాడ వెళ్లే రహదారి ఎక్కడికక్కడ కోసుకుపోయింది. నల్లమాడ నుంచి కుటాలపల్లి వరకూ 5 కి.మీ. రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారుల దుస్థితిపై పలుమార్లు 'స్పందన' కార్యక్రమంలో వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదనిఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



గుంతలు పడ్డ తిప్పయ్యగారిపల్లె

ఉపాధి పనులు కల్పించండి

అధికారులు పట్టించుకోలేదని ఆవేదన

ప్రజాశక్తి - గాండపెంట

తమకు ఉపాధి పనులు కల్పించాలని మండల పరిధిలోని తుమ్మల బైలు పెద్ద తండాకు చెందిన కూలీలు కోరుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీ మారుమూల అడవి ప్రాంతంలో ఉందన్నారు. ఇక్కడ అంతా గిరిజనులమే అని కూలి చేసుకుని జీవన సాగించాల్సిందేనని అన్నారు. అయితే అధికారులు తమకు ఉపాధి పనులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మండలంలో మిగిలిన పంచాయతీలో పనులు జరుగుతున్నాయని తమకు ఫీల్డ్ అసిస్టెంట్ అందుబాటులో లేడని అన్నారు. ఆయన కదిరిలో నివాసం ఉంటున్నాడని ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో తెలియదని అన్నారు. తాము పనులు లేక ఇబ్బందులు పడుతున్నామనిఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొనిఉపాధి పనులు కల్పించాలని కోరారు.



కబ్జాకు గురైన దోబీఘాట్ బోరుబావి

దోబీఘాట్ బోరుబావి కబ్జా

ప్రజాశక్తి- కనగానపల్లి

మండల పరిధిలోని కోనాపురంలో రూ. 5 లక్షలతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన దోబి ఘాట్ బోరును సైతం ఓ వైసిపి నాయకుడు ఆక్రమించుకొని సొంత పొలానికి పైప్ లైన్ వేసుకున్నాడు. గత ప్రభుత్వ హయాంలో 2017 సంవత్సరంలో స్థానికుల కోరిక మేరకు రూ. 5 లక్షలతో దోబీ ఘాట్, బోరు ఏర్పాటు చేశారు అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు దోబీఘాట్‌లోని బోరుని ఆక్రమించుకున్నాడు. తన సొంత పొలానికి పైప్ లైన్ వేయించుకొని వ్యవసాయానికి వాడుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది తెలిసినా ప్రభుత్వ అధికారులు చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి దోబీ ఘాట్ బోరుబావి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఓబుళదేవరచెరువు : అర్హులైన మహిళలు ఉచిత గ్యాస్ కనెక్షన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీ దుర్గా హెచ్.పి. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు డి. సూర్యనారాయణ రెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఇది వరకు ఎటువంటి గ్యాస్ కనెక్షన్ లేని మహిళలకు హెచ్పి గ్యాస్ కార్యాలయంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన మహిళలు రేషన్ కార్డుతో పాటు రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరి ఆధార్ కార్డులు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మానవ హక్కులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మండల పరిధిలోని మోటుమర్ల గ్రామంలోని కెజిబివిలో ఆదివారం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వీటిపై అవగాహన కల్పిస్తే, మంచి ప్రయోజనం తో పాటు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం గత సంవత్సరం ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఇఎస్‌విఆర్ సేవా ట్రస్టు సహకారంతో నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐ హెచ్ ఆర్ పి సి జిల్లా అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి,సభ్యులు ఫరూక్ ఉల్లా, ఇమామ్, ముదషీర్, కలీం, కళాశాల ప్రిన్సిపల్, హాస్టల్ వార్డన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ఒబులదేవర చెరువు : స్థానిక సి అండ్ ఐ జి చర్చిలో ఉపాధ్యాయులు దార్ల రాజశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు ఉచితంగా చీరలను ఆదివారం పంపిణీ చేశారు. ఈనెల 25న క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని తమవంతుగా చీరలు పంపిణీ చేసినట్లు రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాతాను, చర్చి ఫాదర్ ఎం జయానందం, సభ్యులు ఎంయు రఘుకుమార్, బాలరాజు, సునీల్ కుమార్, టీచర్ భారతి, విజయమ్మ, సుగుణమ్మ, ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూపంపిణీ జాబితా తయారీపై అనుమానాలు

ఆందోళనలో అర్హులైన లబ్ధిదారులు దండుకుంటున్న దళారులు

ప్రజాశక్తి - నంబులపూలకుంట

గత నాలుగు సంవత్సరాల నుండి అసైన్మెంట్ భూ పంపిణీ ఉంటుందని రెవిన్యూ అధికారులు చెప్పడంతో అనేక మంది అర్హులైన పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన భూమిలేని నిరుపేద రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ భూముల్లో ఉన్న రాళ్లను, చెట్లను జెసిబిలతో తొలగించి భూమిని చదును చేసుకున్నారు. మండలంలోని అలాంటి రైతులు తమకు భూపంపిణీ చేయాలని దరఖాస్తులను రెవెన్యూ అధికారులకు సమర్పించారు. దాదాపు 2వేల వరకు దరఖాస్తులు ఇచ్చినట్లు తెలుస్తోంది. దరఖాస్తు ఇచ్చిన రైతులకు రెవెన్యూ అధికారులు సూచనలు చేసినట్లు సమాచారం. సర్వేయర్ చేత భూమి కొలతల స్కెచ్‌ని చేయించుకోవాలని చెప్పడంతో సంబంధిత రైతులు వెంటనే ఆపనిలో పడ్డారు. అప్పుడు రంగంలోకి దిగిన లైసెన్సు కలిగిన ప్రయివేటు సర్వేయర్లు రైతుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేసి సర్టిఫికెట్ ఇచ్చారు. ఇదిలా ఉండగా గ్రామ సచివాలయాలకు నియమింపబడిన సర్వేయర్ల చేత మరి కొంతమంది రైతులు భూమి సర్వే చేయించి కొలతల స్కెచ్‌నీ చేయించుకున్నారు. ఇందుకోసం ఆయా గ్రామాల పరిధిలో కొంతమంది దళారులు సర్వేయర్‌కు, రైతులను మధ్యవర్తులు వ్యవహరించి అందినడానికి దండుకున్నారు. ఇంత జరిగిన తర్వాత రెవిన్యూ అధికారులు చావుకబురు చల్లగా చెప్పారు. అసైన్మెంట్ భూ పంపిణీ విషయంలో ప్రయివేటు సర్వేయర్లు ఇచ్చిన భూమికొలతల స్కెచ్‌నీ సర్టిఫికెట్ చెల్లదని చెప్పారు. దీంతో బాధిత రైతులు లబోదిబో మంటున్నారు. ఇదిలా ఉండగా భూపంపిణీ ఏయే రైతులను చేస్తారో అధికారులు ఇంతవరకు చెప్పకపోవటంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపంపిణీకి ఎవరు అర్హులో కూడా సరిగ్గా చెప్పకపోవటంతో దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలువురు నాయకులు అధికారులను ప్రశ్నిస్తే వారు దాటవేత సమాధానాలు ఇస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నారు. అధికారులకు విధేయులుగా ఉన్నవారికి, అధికారపార్టీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే భూపంపిణీ జాబితాలో చోటు దక్కేలా లోగుట్టు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. మండలంలోని మరికమ్మ దిన్నె, వెలిచలముల, ధనియాల చెరువు, వంకమద్ది గ్రామాలోల ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉంది. ఈ ప్రభుత్వ భూమిని రెవిన్యూ అధికారులు బడా ప్రైవేట్ కంపెనీ వారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారే కానీ భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ పంపిణీ చేయడానికి ముందుకు రావటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన ప్రతి రైతుకు భూమిని పంపిణీ చేయాలని వామపక్షపార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థి ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్: ఉదయాన్నే నిద్ర లేవకపోవడంతో తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి వినయ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన నాగరాజు కల్పన ఆదివారం పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే వారి కుమారుడు వినయ్ నిద్ర లేవకపోవటంతో ఉదయాన్నే నిద్రలేవాలని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన వినయ్ తన తల్లిదండ్రులు ఇంటి నుండి వెళ్లిన అనంతరం ఇంట్లోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన వినయ్ సోదరుడు తల్లిదండ్రులకు సమాచారమందించాడు. మృతుడు వినయ్ పెడపల్లి ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. సంఘటన స్థలాన్ని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

లేపాక్షి : మండలం పరిధిలోని మనేంపల్లి గ్రామ శివార్లలో ఉన్న ఓబుళాపురం చెరువు వద్ద పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. లేపాక్షి, హిందూపురం మండలాలతో పాటు కర్నాటకకు చెందిన బాగేపల్లి, గౌరీబిందనూరు, చిత్రదుర్గ, తుంకూరు తదితర ప్రాంతాల వారు 28 మంది జూదం ఆడుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 21 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 3. 05 లక్షలు, 20 సెల్ ఫోన్‌లు, 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారైన వారిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్ఐ గోపీ తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తులపల్లి : రాబోయే ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చూసుకోవాలని గొడవలకు దూరంగా ఉండాలని ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి గ్రామాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. మద్యం, గుట్కా అమ్మేవారి ఇళ్లుతనిఖీలు చేశారు. సూరీ అనే వ్యక్తి ఇంట్లో ఉన్న 10 కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రౌడీ షీటర్ల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించి వారికి కౌన్సిలింగ్ చేశారు. ఆనంతరం గ్రామస్తులతో సమావేశమై పలు సూచనలు. సలహాలు అందించారు.

ప్రతి మనిషీ బాధ్యతగా మెలగాలి

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

ప్రతి మనిషి బాధ్యతగా మెలగాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చరల్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిసెంబరు 10వ తేదీని అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయుడు మాట్లాడుతూ భూమి మీద సమస్త జీవరాసులకు మనలాగే హక్కులు ఉంటాయని గుర్తించాలని అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాధ్యతలను నిర్వర్తించాలన్నారు.

కెంపేగౌడ జయంతి వేడుకలు

అమరాపురం : మండల కేంద్రంలోని శ్రీ సాయి విద్యానికేతన్ ఆవరణంలో ఒక్కలిగా సేవా సంఘం సమితి ఆధ్వర్యంలో కెంపెగౌడ, బసుమయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కెంపే గౌడ, బసుమయ్య చిత్రపటాలను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హెచ్‌బి నర్సే గౌడ్, కర్నాటక రాష్ట్ర ఒక్కలిగా కార్పొరేషన్ డైరెక్టర్ రాజన్న, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వక్కలిగా రాష్ట్ర కార్యదర్శి పాండురంగప్ప, జెడ్పీటీసీ అనంతరాజు,హల్కూర్ కాంత్ రాజు, మంజునాథ్, వైస్ ఎంపీపీ రంజిత్ కుమార్, నళిని రంగే గౌడ్, ఎంపీటీసీ హనుమంతరాయప్ప, త్రిలోక్‌నాథ్, గోడనుకుంట వీరకేతప్ప, బిఎల్ఆర్ వీరక్షేత్రాయ, కన్వీనర్ గురుమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, జై రామప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం యథాతథంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల అయింది. ప్రతి వారం నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల స్థాయిలో కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి వారి సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీ, ఆధార్ కార్డు నకలు, ఫోన్ నెంబర్ అందజేయాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వన భోజనం

హిందూపురం : పట్టణంలోని పాండు రంగ నగర్‌లో ఆదివారం పాండురంగ నగర్ అభివృద్ధి సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ శాసనసభ్యులు అబ్దుల్ ఘని మాట్లాడుతు పాండురంగ నగర్ వాసులు ఏర్పాటు చేసుకున్న కార్తీక వనభోజనం కార్యక్రమానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రమ్మ, మిత్ర ప్లాంట్ ఓబులేష్, కళా శివ, చలపతి, కృష్ణ చైతన్య, కురుబ సుబ్బు, మండి మర్చంట్ సభ్యులు, ఆర్య వైశ్యప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేత కార్మికులకు కంటి వైద్యపరీక్షలు

ధర్మవరం టౌన్ : చేనేత కార్మికులకు కంటి పరీక్షలు చేయడం ఆనందంగా ఉందనిరిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని శివానగర్ లోని ఏడో వార్డు సచివాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శ్రీ చౌడేశ్వరి దేవి సేవాసమితి నిర్వాహకులు బీరే శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నరసింహులు, శ్రీరాములు మాట్లాడుతూ చేనేత కార్మికులకు, వృద్ధులకు, పిల్లలకు, పెద్దలకు కంటి సమస్య ఉన్న వారందరికీ కూడా ఉచితంగా వైద్య చికిత్సలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరంలో 58 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత మహిళా నాయకురాలు జయశ్రీ, కౌన్సిలర్ కేత లోకేష్ తో పాటు శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

డీ-ఫార్మసీలో మిగులు సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

హిందూపురం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల డి. ఫార్మసీ కోర్సులో కౌన్సెలింగ్ అనంతరం మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 13న తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ యన్. హరీష్ బాబు ఆదివారం తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ లో ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్ మార్క్ లిస్ట్, స్టడీ సర్టిఫికెట్ (6 నుండి 12 వ తరగతి వరకు), కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ టీసీ (ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్) ధ్రువపత్రాలను మూడు సెట్లుగా జిరాక్స్ తీసుకొని నిర్దేశించిన తేదీన ఉదయం 9.30 నిమిషాలకు కళాశాలలో హాజరుకావాలన్నారు. ఓపెన్ కేటగిరీ (ఓసీ) కి చెందిన అభ్యర్థులు ఈబ్యూఎస్ అర్హత కలిగి ఉంటే (వార్షిక ఆదాయం రూ. 8 లక్షల లోపు ఉన్న వారు) ఈబ్యూఎస్ సర్టిఫికెట్ తో కౌన్సిలింగ్ కు హాజరైతే కేటాయించిన రిజర్వేషన్ పొందడానికి అవకాశం ఉందన్నారు. ఈ ప్రవేశాల్లో చేరిన ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.6,300, ఎస్సీ, ఎస్టీలు అభ్యర్థులు రూ.5,700 ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. తక్షణమే చేరిన విద్యార్థులకు వసతిగృహ సదుపాయం కల్పిస్తామన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించాలన్నారు. లేదా 98662 73402, 9703843680 సెల్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం : పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో హిందూపురం జామీయ మసీదు కమిటీ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన సప్తగిరి మెడికల్ కళాశాల రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ వైద్యుల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు అభిషేక్, విజయ్‌కుమార్, సాక్ష్యం, ఆదర్శ, శేఖర్, జయవర్ధన్ గౌడ్‌లు వైద్య శిబిరంలో ప్రజలకు ఈసీజీ, ఎకో టెస్ట్, కార్డియా ఫిట్ నెస్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి నూరుల్లా ఖాన్, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్ఫారూక్, షబ్బీర్, జామియా మసీదు కమిటీ సభ్యులు ఖలీల్, ముక్తియార్, అతావుల్లా, షఫీవుల్లా, అల్లాబకాష్, ఆసీఫ్, ఫైరోజ్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

గోరంట్ల : మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన పెనుగొండ నియోజకవర్గం ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్‌బాషా ఇటీవల జరిగి ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం ఫిరోజ్‌బాషా ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు టిడిపి కార్యదర్శి దేవా నరసింహప్ప, బెల్లాల చెరువు చంద్ర, రామానుజన్ రెడ్డి, గంగిరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ కార్యాలయం ప్రారంభం

మడకశిర : పట్టణంలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పిఎస్ కార్యాలయాన్ని ఆసంగం రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనతో పాటు ఉపాధ్యక్షులు నరసింహులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మనూరు గోవిందప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు రత్నమ్మ, హిందూపురం పార్లమెంటు అధ్యక్షులు మనురు చౌడప్ప, నాయకులు గంగాధర్, నాగరాజు, పోలీస్ రామప్ప తిప్పన్న, సాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు

బత్తలపల్లి : మండలంలోని మాల్యవంతం సమీపంలోని శ్రీమహాగణపతి, అన్నపూర్ణేశ్వరి, లక్ష్మీనరసింహ సమేత శ్రీకాశీనాయన ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వెంకటేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

మడకశిర : మండల పరిధిలోని చందకచర్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకొన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి నరసింహారెడ్డిని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చందకచర్ల మాజీ సర్పంచి ఆంజనేయులు, సీనియర్ నాయకులు రామకృష్ణప్ప, కృష్టప్ప, రంగనాథ్, వెంకటాద్రి, వెంకటేష్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ఓబుళదేవరచెరువు : క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, నియోజవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలకు ప్రజలకు జనసేన సేవలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయరాం రెడ్డి, అంకె ఈశ్వర్, తాడిపత్రి ఇన్‌ఛార్జి శ్రీకాంత్ రెడ్డి , ఐటీ వింగ్ పుట్టపర్తి ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్ , ఒడిసి మండల అధ్యక్షులు మేకల ఈశ్వర్, వాలసపల్లి ఆంజనేయులు, పూల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాస్మొటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలి

ఓబుళదేవరచెరువు : హాస్టల్ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న కాస్మొటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ ఎస్టీ మానెటరింగ్ డివిజనల్‌కమిటీ సభ్యులు రాంప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరల కారణంగా ప్రభుత్వం ఇస్తున్న కాస్మొటిక్ ఛార్జీలు ఏమాత్రం సరిపోవన్నారు. కావున కాస్మొటిక్ ఛార్జీలను రూ. 1500లకు పెంచాలని, పెండింగ్లో ఉన్న నిధులు విడుదల చేయాలి కోరారు.

మాజీ సర్పంచి మృతి

మడకశిర : పట్టణంలోని ఆరేపేటకు చెందిన మాజీ సర్పంచి రంగధామప్ప మృతిచెందాడు. ఆయన మృతికి సిడబ్ల్యుసి మెంబర్ మాజీమంత్రి రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యేలు, ఈరన్న, సుధాకర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గుర్తించిన పార్టీకే మద్దతు



తమ ఐక్యత చాటుతున్న జిల్లా యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

తమను గుర్తించే పార్టీకే సంపూర్ణ మద్దతు తెలుపుతామని యాదవ సంఘం నాయకులు అన్నారు. పుట్టపర్తి పట్టణ కేంద్రంలోని శిల్పారామంలో జిల్లాలోని యాదవ సంఘం నాయకులు ఆత్మీయసమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని యాదవ్ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసప్ప మాట్లాడుతూ పుట్టపర్తిలోని సర్వే నంబర్ 22 నందు బోడిగుట్టలో ఉన్న భూమిని గతంలో యాదవుల ఆధీనంలో ఉండేదన్నారు.. కానీ అది ఇప్పుడు ప్రభుత్వం ఆధీనంలో ఉందన్నారు. జిల్లా కేంద్రంలో యాదవ సంఘానికి సంబంధించి కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు, శ్రీకృష్ణుని దేవాలయానికి ఆ భూమిని కేటాయించాలని కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల యాదవ ఓట్లు ఉన్నాయన్నారు. పార్లమెంటు, శాసనసభ నియోజకవర్గాలలో అభ్యర్థుల జయాపజయాలను యాదవుల ఓట్లు ప్రభావితం చేస్తాయన్నారు. ఈనేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో యాదవులకు ఒక ఎంపీ 4 ఎమ్మెల్యే స్థానాలకు టికెట్లను కేటాయించలన్నారు. ఏ పార్టీ అయితే గుర్తించి టికెట్లు ఇస్తుందో ఆ పార్టీకే సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. లేనిపక్షంలో యాదవుల సత్తా ఏమిటో చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జనరల్ సెక్రెటరీ దయ్యాల ఉమాపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బాలాంజనేయ యాదవ్, నాయకులు వరప్రసాద్, గంగాధర్, నారాయణస్వామి, నరసింహ, కృష్ణమూర్తి, సుధాకర్ శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రాజశేఖర్, సురేంద్ర, కొండయ్య, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫజులుద్దీన్ ను అభినందిస్తున్న జీవనజ్యోతి పాఠశాల హెచ్ఎం ఝాన్సియా


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు 'జీవనజ్యోతి' విద్యార్థి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

గత నెల ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 హాకీ పోటీలలో పాల్గొన్న పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్. పజులుద్దీన్ ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్.ఎం. సిస్టర్ ఝాన్సీయా తెలిపారు. ఫజులుద్దీన్ ఈనెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో జరిగే ఎస్‌జిఎఫ్ అండర్ -14 రాష్ట్రస్థాయి హాకీ పోటీలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని సుబ్బరాయన పల్లిలో నిర్మించ తలపెట్టిన రామాలయ అభివృద్ధికి దాత లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. గతంలో గ్రామంలో ఉండి ఉద్యోగరీత్యా హిందూపురంలో స్థిరపడ్డ రాయల్ల చంద్రశేఖరప్ప కుమారుడు ఉపాధ్యాయుడు గురు ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు వెంకటేశ్వర ప్రసాద్, శ్రీనాథ్, శేషాద్రి నాయుడు మీనాక్షమ్మ ఆదివారం గ్రామంలోని ఆలయ కమిటీ సభ్యులకు ఆ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ సొంత గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఈ దేవాలయానికి తన వంతు సాయంగా లక్ష రూపాయలు అందజేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో గుడి నిర్మాణంలో, ఎలాంటి కార్యక్రమాల్లో నైనా తన వంతు సాయాన్ని అందిస్తానని తెలిపారు .ఈ కార్యక్రమంలో శేషాద్రి నాయుడు, మాజీ సైనికుడు మహానంద, జయచంద్ర, అరవింద్ రెడ్డి ,చౌడప్ప ముద్దల చినరాయుడు , బయపరెడ్డి, మేకల నరసింహులు,కేశవ, లింగమయ్య, శివ, హరీష్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాతలు

ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: సునీత



మినీమేనిఫెస్టో కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత



నాయకులు, కార్యకర్తల సమావేశంలో బికె. పార్థసారథి

ప్రజాశక్తి - కనగానపల్లి

రాప్తాడు నియోజకవర్గంలో ఈనాలుగేన్నరేళ్లలో ప్రాజెక్టులు ఏం నిర్మించారో... ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి సవాల్ విసిరారు. మండలంలోని రాంపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోకి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అందులో ఉన్న పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్నప్పుడు శాశ్వత ప్రాతిపదికన జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే క్రమంలో భాగంగా ప్రధాన కాలువ నిర్మాణంతో పాటు కనగానపల్లి మండలంలో సోమరవాండ్లపల్లి పుట్టకనుమ ప్రాజెక్టును తీసుకొచ్చామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక పుట్టకనుమ ప్రాజెక్టును రద్దు చేశారన్నారు. 2019ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే.. కచ్చితంగా ముందుగానే డిజైన్ చేసిన అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేవారమన్నారు. వైసీపీ నాయకులు పుట్టకనుమను రద్దు చేసి.. ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లను నిర్మిస్తామని ప్రగల్భాలు పలికారని విమర్శించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి కనీసం ఒక ఎకరం కూడా భూసేకరణ చేయలేదని ఎద్దేవా చేశారు. వీటి కోసం లక్ష రూపాయల నిధులు కూడా మంజూరు చేసిన పరిస్థితి లేదన్నారు. సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం కొంతవరకు పనులు చేశాక.. కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆ పనులు కూడా నిలిచిపోయాయన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. లక్ష ఎకరాలకు నీరు ఇచ్చామని చెప్పే ఎమ్మెల్యే కనీసం పిల్ల కాల్వలు కూడా బాగు చేయించలేకపోయారని ఎద్దేవా చేశారు.

గోరంట్ల : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పట్టణంలోని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వత్ రెడ్డి నివాసంలో టిడిపి కార్యకర్తలు నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ గోరంట్ల మండలంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరసింహులు, నీలకంఠ రెడ్డి, బెల్లాల చెరువు చంద్ర, వెంకట్ రెడ్డి, నరేష్ కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో పార్టీకి పూర్వవైభవం : పల్లె

ప్రజాశక్తి ఓబుల దేవర చెరువు

పుట్టపర్తి నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకువస్తామనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఓడి చెరువు నుండి తంగేడు కుంట పంచాయతీ వరకు సుమారు 16 కిలోమీటర్లు సాగిన టిడిపి బైక్ ర్యాలీలో పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ టీడీపీదే అని అన్నారు. వైసీపీ ఆగడాలకు ప్రజలే అడ్డుకట్ట వేస్తారని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈసందర్భంగా తంగేడు కుంట పంచాయతీ మద్దకవారిపల్లిలో సుమారు165కుటుంబాలకు పైగా టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, గుండుమల తిప్పేస్వామి, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్ట ఓబుల్ రెడ్డి, జాకీర్, పీట్ల సుధాకర్, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బూదిలి ఓబుల్ రెడ్డి, అంజనప్ప, ఆరీఫ్‌ఖాన్, షాను, మండ్యం చాంద్‌బాషా, షబ్బీర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి